# పోటీకి పంపిన కథ

♦

రచన : కుమారి రమణమ్మ

'నువ్వు వ్రాయలేవు సీతా!' భార్యవైపు చూసి నవ్వుతూ అన్నాడు శేఖర్.

'ఎందుకు వ్రాయలేనూ?' ఎదురుప్రశ్న వేసింది సీత.

'దీపావళి కథలపోటీ... ముగింపు తేది జూన్ 28.' పత్రికలో ఆ ప్రకటన చూచినప్పటినుంచి ఆమె మనస్సు దీపావళి కథలపోటీకి కథ వ్రాయాలని వుబలాట పడుతున్నాది. అందుకే సాయంత్రం శేఖర్ ఆఫీసునుంచి రాగానే అతనికి కాఫీ అయినా యివ్వకుండా పత్రిక తీసుకొచ్చి' చూడండి, నేను దీపావళి కథల పోటీకి కథ వ్రాయాలనుకుంటున్నాను.' అమిత వుత్సాహంతో చెప్పుకుపోతున్నాది సీత.

'నీవు వ్రాయలేవు. అంతే' భార్యను వుడికించినట్లుగా ఈమారు కొంచెం గట్టిగా నవ్వుతూ అన్నాడు. అతనికి నవ్వు ఎంత ఆపుకుందామన్నా ఆగటంలేదు ఆ సమయంలో.

'అదే ఎందుకు వ్రాయలేను' కొంచెం రెట్టించి అడిగింది సీత. అప్పటికే ఆమె ముఖంలో కోపం తొంగి చూస్తున్నాది. ఆమె విశాల నయనాలు కోపంతో అరుణవర్ణందాల్చేయి. ఆమెలో వున్న వుత్సాహమంతా నశించిపోగా, అలాగే పుస్తకాన్ని పట్టుకుని అక్కడే నిలబడిపోయింది.

'ఎందుకు వ్రాయలేవో కొద్దిరోజులు పోతే నీకే తెలుస్తుంది' అని సీత వైపు కొంటెగా చూస్తూ 'యివాళ బయట అర్జెంటు పనివుంది. ఈపాటికి రఘు కూడా బస్‌స్టాపు దగ్గర నాకోసం వెయిట్ చేస్తూ వుంటాడు. ఊ... త్వరగా కాఫీ పట్టుకురా' అంటూ అద్దం ముందుకుపోయి తలదువ్వుకోసాగేడు.

ఇతచెప్పేదూ ఇంతే, నాకు కథ వ్రాయడానికి ప్రోత్సాహమివ్వడం పోయింది, నన్ను డిస్టర్బ్ కూడా చేస్తున్నారు, ఇతనికి చెప్పడం మానేయవలసింది అని మనసులో విసుక్కుంటూ చిరాగ్గా తనచేతిలోని పత్రికను బల్లపైకి విసిరేసి అక్కడినుంచి వెళ్ళిపోయింది సీత.

శేఖర్ సీత వెళ్ళినవైపే చూస్తూ ఏమిటో ఈ ఆడవాళ్ళకు తొందరపాటేగాని ఆలోచనా శక్తి తక్కువ అనుకున్నాడు మనసులో.

ఐదు నిముషాలలో భార్య యిచ్చిన కాఫీ కప్పును ఖాళీచేసేసి బయటకు వెళ్ళిపోయేడు శేఖర్.

రాత్రి భోజనాలయేక ఇంటి పనులన్నీ త్వరత్వరగా పూర్తిచేసుకుంది సీత. త్వరగా పనులైపోతే కథవ్రాసుకోవచ్చు అన్న వుద్దేశ్యంతో.

పనులన్నీ పూర్తయేసరికి రాత్రి ఎనిమిదిదాటి తొమ్మిది కావస్తున్నాది. అప్పటికే ఆమె చాలా అలసిపోయింది. నిద్రకుసూచనగా కనురెప్పలు కూడా బరువుగా క్రిందికి వాలిపోతున్నాయి. కథ వ్రాయాలన్న ఆశక్తితో లేనిశక్తిని తెచ్చుకుని లెటర్ పేడ్, పెన్నుతీసుకుని కుర్చీలో కూర్చొని మంచి ప్లాట్ కోసం తీక్షణంగా ఆలోచిస్తున్నాది. ఆమెకు కథవ్రాయాలన్న వుబలాటం తప్ప మరే ధ్యాసాలేదు ఆ సమయంలో.

పదినిముషాలు గడిచిందో లేదో శేఖర్ హడావిడిగా గదిలోనికి వస్తూ 'సీతా! ఏమిటి చేస్తున్నావు?' అన్నాడు. నిజానికి అతనికి సీత ప్లాట్ కోసం ఆలోచిస్తున్నాదని తెల్సు. కాని అడగాలనే అడిగేడు. ఆమె నలా ఆటపట్టించడం అతనికి హాబీ అయిపోయింది.

'కథ వ్రాద్దామని కూర్చున్నాను. మీరు నేను కథ వ్రాయలేనని అన్నారుగా, మీరు అన్నదానిమీద పంతానికైనా నేను కథ వ్రాసితీరాలి అని నిశ్చయించుకున్నాను.' చాలా ధీమాగా చెప్పింది సీత.

'ఓహో! అలాగా' అంటూ అక్కడే వున్న కుర్చీలో కూర్చుంటూ 'సీతా! త్వరగా తయారవు. సినిమాకు టికెట్సు తిసేసేను. రఘు, రఘు మిసెస్ కూడా మనతో వస్తున్నారు. పద ...' అంటూ సీత ఎంతకీ అక్కడనుంచి కదలక పోయేసరికి తనే చప్పున సీత చేతిలోని పెన్ను లాక్కుని కేప్ పెట్టేసి, అక్కడ తెరచివుంచిన లెటర్ పాడ్‌ను మూసేసి టేబిల్ మీద సర్దేశాడు.

ఆ సమయంలో సీతకు భర్తకు ఎదురు చెప్పడానికి ధైర్యం చాలలేదు. తనను డిస్టర్బ్ చేసినందుకు ఆక్షణంలో సీతకు శేఖర్‌పై పట్టరాని కోపం వచ్చేసింది. అప్పటికే ఆమెలోని కోపం పాములా బుసకొట్టడం ప్రారంభించింది. కాని చేసేది లేక తనకోపాన్ని లోనే అణచుకొని, తను వెళ్ళకపోతే శేఖర్ బాధపడతాడని వెంటనే డ్రస్సు చేంజి చేసుకుని సినిమాకు బయలుదేరింది.

* * *

ఆ మర్నాడు మధ్యాహ్నం కథ వ్రాద్దామని పెన్ను, లెటర్ పాడ్ ముందేసుకు కూర్చుంది సీత. ఇవాళ ఎలాగైనా కొంచెం కథ వ్రాసేయాలి అనుకుంది మనసులో.

'అమ్మగారూ! గిన్నె పడేస్తారా?' ఒక్కసారే కేకేసింది పని మనిషి.

ఇల్లంతా నిశ్శబ్దంగా వుండేమో పని మనిషి కేకకు ఉలిక్కిపడింది సీత. అప్పటికే ఆమెకు మంచి ఐడియాస్ వస్తున్నాయి. ఛీ! మధ్యలో ఇది ఒకత్తె. అమ్మగోరూ గిన్నెపడేస్తారా అని విసుక్కుంటూ వంటగదిలోనికిపోయి గిన్నెలన్నీ పడేసివచ్చి కుర్చీలో కూర్చుంది.

మరో పదినిముషాలు గడిచిందో లేదో అమ్మగోరూ! నే వెళిపోతున్నా తలుపేసుకోండి' మరలా పని మనిషి గొంతు కంగుమంది.

అబ్బబ్బ! వెధవ బాధ. నన్ను కథ వ్రాసుకో నీయకుండా ఇదొకత్తి నా ప్రాణంమీదికి అని సణుక్కుంటూ బదకంగా అక్కడినుంచి లేచి తలుపు వెయ్యడానికి వీధి తలుపు దగ్గర కొచ్చింది:

వీధి గుమ్మంలో ఎప్పటినుంచి నిలబడ్డాడో ఏమిటో యెదురుగుండా యమధర్మరాజులా గేదెతో పాలవాడు ప్రత్యక్షం. నాయనా! సమయంలో సంగీతం అన్నట్లు నీవు కూడా యిప్పుడే తగలడ్డావు? ఈ వేళ కూడా నాకు కథవ్రాసే ప్రాప్తం లేదు కాబోలు, వీళ్ళందరూ కలిసి నా ఐడియా సీను చెడగొట్టేరు, వెధవలు అని మనసులో పని మనిషిని, పాలవాడిని కసితీరా తిట్టేసింది. ఆ సమయంలో వాళ్ళిద్దరిని కొట్టెయ్యాలన్నంత కోపం వచ్చేసింది సీతకు.

సీత గిన్నెలో పాలు కొలిపించుకొని లోనికి వచ్చేసరికి వాల్ క్లాక్ నాల్గుగంటలు కొట్టేసింది.

'తా! సాయంత్రం నేను వచ్చేసరికి వంటది పూర్తి, చేసి రడీగావుండు ఎగ్జిబిషన్‌కు వెళదాము'. వెంటనే వుదయం ఆఫీసుకు వెళుతూ శేఖరన్నమాటలు గుర్తుకొచ్చాయి.

అయ్యో! అప్పుడే నాల్గుగంట లయిపోయింది! ఇంక డ్యూటీలో జాయిన్ అయిపోవాలి. ఇప్పటికి నా ఐడియాస్‌కు గుడ్ బై అంటూ లెటర్ పేడ్, పెన్నుమూసేసి వంటింట్లోనికి పరుగెత్తింది.

.సీతా! నిన్ను డ్యూటీలోనుంచి డిస్‌మిస్ చెయ్యాలి.' ఎగ్జిబిషన్‌నుంచి వచ్చిన తర్వాత భోజనంచేస్తూ నవ్వుతూ అన్నాడు శేఖర్.

సీతకేమీ అర్థం కాక 'ఏమండి. ఏమి తప్పు చేసేను?' అని అడిగింది.

'ఈ కథ వ్రాయడంకాదు గాని, నీకు మతిమరపు జాస్తీ అయిపోతున్నాది. కథ గురించి ఆలోచిస్తూ వండి వుంటావు చారులో వుప్పెయ్యడం కూడా మరచిపోయేవు.' గట్టిగా ఇల్లెగిరిపోయేలా నవ్వేడు శేఖర్.

సీతకు కూడా ఎంత ఆపుకుందామన్నా నవ్వు ఆగటం లేదు. తను కూడా భర్తతో సమానంగా గట్టిగా నవ్వేసింది.

'సీతా! ఇంతకీ నీ కథ ఎంత[illegible]కూ వచ్చింది?' మరొకసారి భార్యను ఏడిపించాలనుకున్నాడు శేఖర్.

Trade Mark Regd. Ne: 243795




- శ్రేష్ఠమైన రకం
- తక్కువ ధర
- చిరకాల మన్నిక
- చక్కని అల్లిక



ఇవే

పొన్‌మని బనియన్ల విశిష్ఠత.

(ఏజెంట్లు లేని ఊళ్ళో ఏజెంట్లు కావలెను)

: వివరములకు :

పొన్‌మని నిటింగ్ కంపెని
పి. ఎన్. రోడ్డు : : తిరుపూరు.

PONMANI KNITTING CO.,
P.N.: RODE :: TIRUPUR (S I)

'నా గొంతువరకు' అప్పటివరకు నవ్వుతున్న సీతముఖం కోపంతో ఒక్కసారిగా గంభీరంగా మారిపోయింది. కోపంలో కళ్లు ఎర్రబడ్డాయి. కళ్లనుండి నీరు వుబకడానికి సిద్ధంగా కళ్ల లోపలినుండి తొంగిచూస్తున్నాయి.

'ఏమిటి? కొంచెం కూడా వ్రాయలేదా?' ఏమీ తెలియనట్లుగానే అడిగేడు శేఖర్.

'లేదు. అసలు ఐడియానే రావటంలేదు. ఇవాళ మధ్యాహ్నం వ్రాద్దామని కూర్చున్నానా...పని మనిషి, పాలవాడు ఆ తర్వాత'... శేఖర్ వైపుచూస్తూ కొంచెం సేపు ఆగిపోయింది.

'ఆ తర్వాత నేను ఎగ్జిబిషన్‌కు తీసుకెళ్ళడం. పాపం ఈరోజు కూడా నీకు వ్రాయడానికి కుదరలేదన్నమాట' విచారంగా, ముఖంపెట్టి సానుభూతిగా భార్యవైపు చూసేడు శేఖర్.

'ఫరవాలేదు. ఎన్ని ఆటంకాలొచ్చినా సరే, అర్ధరాత్రైనా సరే లేచి వ్రాసితీరుతాను.' కొంచెం సీరియస్‌గానే చెప్పింది.

'ఆహా! ఏమిశ్రద్ధ, పట్టుదల రచయిత్రి అంటే అలా వుండాలి. బైదిబై సీతా! నీకు ఐదురోజులు ఫ్రీ. నేను రేపుదయమే కేంపు వెళిపోతున్నాను. ఐదురోజులవరకు తిరిగిరాను. నేను తిరిగివచ్చేసరికి నీవు చక్కగా కథ వ్రాసేసుకోవచ్చు. కథ వ్రాసేసి వుంచు, కావలిస్తే నేను వచ్చి ఫెయిర్ కాఫీ చేస్తాను' అంటూ కంచంలో చేయి కడిగేసుకుని అక్కడినుంచి వెళ్లిపోయేడు.

ఆ మాటలన్నంతసేపూ శేఖర్, సీతముఖంలో కలిగే మార్పును గమనిస్తూనేవున్నాడు. ఆ సమయంలో సంతోష రేఖలు తొంగిచూస్తున్నాయి. ముఖం పుచ్చపువ్వులా విచ్చుకుంది.

ఊరికెళుతూ 'నేను వచ్చేసరికి కథ వ్రాసేయాలి' అమిత వేగంతో వస్తున్న నవ్వును పెదాలమధ్య బిగబెట్టి మరి వస్తానంటూ బేగ్ తీసుకుని వెళ్ళిపోయేడు

పాపం. పిచ్చిసీత ఇంకేం కథ వ్రాస్తుంది? ఇవాళ మెయిలులో అమ్మ చెల్లెలు, పిల్లలు దిగబడతారు. గోవిందో హరి వాళ్ళకి సేవచేసేసరికే సీతకు సరిపోతుంది. అసలు ఇప్పటికే సీత కథ వ్రాయడానికి వీలుపడలేదని అందరిమీద విసుక్కుంటున్నాది. ఇంక ఈ సంగతి తెలిస్తే ఏడ్చేసుంది కూడా. అందుకే సీతకు [illegible]యం చెప్పడం మానేసేను. దారిలో అనుకున్నాడు శేఖర్.

శేఖర్‌కు సీతను చూచినప్పుడల్లా ఒక ప్రక్క జాలి, మరోక ప్రక్క నవ్వు ఒక్కుమ్మడిగా వచ్చేస్తుంటాయి. అతనికి జాలికన్నా, ఆమెకథ వ్రాయటానికి పడే ఆరాటమే ఎక్కువ నవ్వును తెప్పిస్తూ వుంటుంది కొన్నికొన్ని సమయాలలో.

* * * *

అమ్మయ్య! ఇన్నాళ్ళకి తీరుబడి అయింది కదా అని మనసులో చాలా సంతోషపడిపోతూ త్వరత్వరగా 9 గంటలకే వంట పూర్తిచేసేసి తీరికగా హాలులో కుర్చీ వేసుకుని కూర్చుంది కథ వ్రాద్దామని.

ఇంతలో వీధి తలుపు ఎవరో తట్టినట్లుగా చప్పుడైంది. గాలికి చప్పుడై వుంటుందని అక్కడనుంచి కదలడం మానేసింది. మళ్లీ పెద్దగా చప్పుడైంది. ఇప్పుడెవరొస్తారు మనింటికి అని మనసులో తనకుతనే ప్రశ్ని[illegible]కుంటూ ఆతృతగా తలుపు తెరిచింది.

తలుపు తెరచి ఒక్కసారి కరెంటు షాక్ కొట్టినట్లుగా కొద్దిక్షణాలు బొమ్మలా వులుకూ పలుకూ లేకుండా లోనికి రండి అని చెప్పడం కూడా మరచిపోయి అక్కడే నిలబడిపోయింది. ఆమె గొంతు తడారిపోయింది. శరీరం కొయ్యబారిపోయి ముచ్చెమటలు పోసేసేయి. ఆమె కళ్లు ఆశ్చర్యంతో రెప్పవాల్చకుండా వారినే చూడసాగేయి

'ఏమే సీతా! బాగున్నావా? అబ్బాయిని స్టేషన్ రమ్మని వ్రాసేను. వాడురాలేదేమే?' మెల్లిగా రిక్షాలోంచి,

WISH YOU HAPPY DEEPAVALI

USE ALWAYS OUR SPECIAL QUALITY

- Matchles—60's Intarlock
- Cool—American
- Beauty - Egiption




POWER HOSIERIES
DHARAPURAM ROAD
TIRUPUR-4(S.I)

దిగి తన భారీ శరీరాన్ని మోయలేక మోయలేక నెమ్మదిగా ఈడ్చుకుంటూ, ఆయాసపడిపోతూ ముఖానికి పట్టిన చెమటను తుడుచుకుంటూ లోనికివచ్చింది రాజ్యలక్ష్మి. మరో క్షణికాలోంచి సీత ఆడపడుచు, పిల్లలు దిగి ఆవిడ వెనకే లోనికి వచ్చేరు.

సీత లోపల కోపగించుకుంటున్నా బాగుండదు కదాని పైకి 'బాగున్నారా? అందరూ కులాసాగా వున్నారా? అంటూ ఆప్యాయంగా పలుకరించింది అత్తగారిని, ఆడపడుచుని.

'రాజ్యలక్ష్మి లోనికివచ్చి తన శరీరాన్ని కుర్చీలోచేరవేసి 'అబ్బ'! అని ఆయాసపడిపోతూ 'ఏమేసీతా! అబ్బాయి కనిపించడేం. ఇంకా పదైనా కాలేదు అప్పుడే ఆఫీసుకు వెళ్ళిపోయేడా ఏమిటి?' గంటకో అక్షరం మాట్లాడుతూ మెల్లిగా ఆమాటను పూర్తిచేసింది రొప్పుతూ.

'లేదత్తా! ఆతను కేంపు వెళ్ళేరు. ఐదురోజులవరకు రారు.' పొడిపొడిగా మాట్లాడేసి వచ్చినవాళ్ళందరికీ స్నానాలకి నీళ్లు పెట్టడానికి బాత్‌రూంలోనికి వెళిపోయింది.

ఆమె హృదయంలో కోపం అగ్ని గోళంలా మండిపోతున్నా పైకిమాత్రం మంచుకురిసినట్లుగా నవ్వుతూ మాట్లాడేస్తున్నాది.

భోజనాలు పూర్తయేసరికి ఆమెలోని వుత్సాహమంతా సన్నగిల్లిపోయి చాలా నీరసం వచ్చేసింది. బాగా అలసిపోయిందేమో ఆ పూటకి కథ వ్రాయటం విరమించుకుని విశ్రాంతికోసం ప్రక్కమీద వాలిపోయింది సీత.

'ఏమేసీతా! ఏమిటి చేస్తున్నావు? పిల్లాడు ఏడుస్తున్నాడు. కాస్త స్టౌ మీద నీళ్లు పెట్టు పాలుకలపాలి.' హాలులోనుంచి వచ్చిన ఆ కంఠధ్వనికి భయపడి ఎక్కడి పుస్తకాలక్కడే వదిలేసి వంటింట్లోనికి పరుగెత్తింది సీత.

'వదినగారూ! కాస్త ఇల్లువూడ్చండి. పిల్లలకి పక్క వేస్తాను' ఆడబడుచు పని పురమాయించింది.

అబ్బబ్బ! వీళ్ళకి అన్నీ అమర్చేసరికే అయిపోతున్నాది కాలమంతా. ఇంకా కథ పంపడానికి అట్టే వ్యవధికూడా లేదు, ఆతను వచ్చేసరికి కథ వ్రాసేయాలనుకున్నాను. కనీసం తీరుబడి కూడా అవటంలేదు. అని విసుక్కుంటూ అత్తగారిని,ఆడపడుచుని లోన కసితీరవిచ్చేసుకుంది.

'మనరామంలేడూ. వాడు పెళ్ళికి రమ్మని ఒకటే వుత్తరాలు వ్రాసేడనుకో వాడి వుత్తరాలధాటికి తట్టుకోలేక మేము బయలుదేరేము. ఎలాగూ ప్రయాణమయ్యేము కదా అని ముందుగా ఇక్కడికివచ్చి మిమ్మల్నిద్దరిని చూసిపోదామని ఇలా వచ్చేసేము, వస్తామే సీతా!' వెళ్లిపోయేముందు తన రాకకు కారణాన్ని వివరించింది రాజ్యలక్ష్మి

గొప్పపనిచేసేరు, అని లోన సణుక్కుంటూ పైకి 'మంచి పనిచేసేరు. మీరు రావడం నాకు చాలాసంతోషంగా వుంది. మా అబ్బాయిగారు కూడా వుంటే చాలా సంతోషించేవారు. మీరు రెండురోజులైనా వుండకుండా వెళ్ళిపోతున్నారు.' మనసులో వారు ఇక్కడ వుండడం ఇష్టం లేకపోయినా సభ్యతకోసం, మర్యాదకోసం అలా అన్నాది. 'వెంటనే మీరు ఇంటికి చేరగానే వుత్తరం

చిరకాల మన్నిక - అతి ప్రకాశవంతమైనది - నవీన పనితనము - చక్కని అమరిక




నావెల్ వజ్రములు

నగలను అలంకరించుటకు,

విశిష్టతకు ప్రసిద్ధి చెందిన

మా వజ్రములకు గ్యారంటి ఇవ్వబడును

: తయారించువారు :

**NOVEL DIAMOND WORKS**

**WEST RANI St., :: TIRUCHIRAPALLI-8.**

వ్రాయండి' అంటూ వారిని గుమ్మంవరకూ సాగనంపింది.

* * * *

సీతా! కథ వ్రాసేసేవా? ఏది చూపించు' అంటూ లెటర్ పాడ్ తెరిచేడు, సీత కథ ఎలా వ్రాసిందో చూద్దామని-ఒక్క తెల్లకాగితమే తప్ప అందులో ఒక్క అక్షరం ముక్క కూడా కనిపించలేదు.

'సీతా! కథ వ్రాయలేదా?' కోపంగావున్న సీతముఖాన్ని చూడగానే వచ్చేనవ్వును బలవంతంగా ఆపుకున్నాడు శేఖర్.

'లేదు, ఏ ముహూర్తాన కథ వ్రాద్దామని కూర్చున్నానో కాని అన్ని ఆటంకాలే మీరు వూరికి వెళ్లినప్పుడు వ్రాద్దామనుకున్నానా? అత్తగారు, మీ చెల్లెలు, పిల్లలు వచ్చేరు. వాళ్లకి సపర్యలు చేసేసరికే పుణ్యకాలం గడచిపోయింది.' అప్పటికే ఆమె కనురెప్పలు నీటితో తడిసిపోయేయి. 'మీరే గెలిచేరు. నేను నిజంగా కథ వ్రాయలేక పోయేను.' కంఠం బొంగురు పోవడంతో మరేమీ చెప్పలేకపోయింది.

ఎప్పుడూ కంటనీరు పెట్టడం ఎరుగని సిత కంటతడి పెట్టడంతో అతని హృదయం ఆమెపై జాలితో నిండిపోయింది.

'ఛీ! ఏడుస్తున్నావా? ఊరుకో. ఇంకా పంపించడానికి వ్యవధి వుందిలే. నేను మంచిప్లాటు చెప్తాను. ఇవాళ, రేపటిలో వ్రాసేయి. నేను నిన్ను డిస్టర్బ చేయనులే. నీవు వండకుండా హోటలునుంచి కారేజీకూడా తెప్పించేస్తాను' నవ్వకుండా సీరియస్‌గా అన్నాడు శేఖర్.

శేఖర్ మాటలు విన్నంతసేపూ సీతకు తను కథ వ్రాయక పోయినా కథ వ్రాసేసినంత సంతోషం వచ్చేసింది. ఆమెకు ఎన్నడూ కలుగని వుత్సాహం, సంతోషం ఒక్కసారిగా వచ్చేసేయి.

భర్త చెప్పిన ప్లాట్ ప్రకారం సీత చక్కని శైలితో, వర్ణనతో కథ వ్రాసేసింది. శేఖర్ రెండురోజులు ఆఫీసుకు సెలవుపెట్టి దానిని ఫెయిర్ కాఫీ చేసేసి తానే స్వయంగా పోస్టు చేసేసేడు.

* * * *

'సీతా! సీతా! ఎక్కడున్నావు; ఇలా రా!' అంటూ లోనికివస్తూ ఒక్క కేక పెట్టేడు శేఖర్.

'ఏమిటండీ! ఏమి జరిగింది' అంటూ హడావిడిగా వంటింట్లో నుంచి పరుగెత్తుకొచ్చింది సీత.

'కంగ్రాట్యులేషన్స్ సీతా!'

'ఎందుకు?' అర్థంకాక ప్రశ్నార్థకంగా చూసింది భర్త వంక.

'ఎందుకేమిటి? నీ కథకు ఫస్టుప్రెయిజ్ వచ్చింది,




మా హృదయ పూర్వకమైన దీపావళి అభినందనలు !!

ఎల్లప్పుడూ...

ఆర్. కె. జి. బనియన్లనే

ఉపయోగించండి.

*

* చక్కని అల్లిక. * సరైన కొలత

* తక్కువ ధర వీటి అన్నిటికీ

ప్రసిద్ధి చెందినది.

తయారించువారు

R. K. G. KNITTING CO.

16 UNIVERSAL ROAD, TIRUPUR-1

నీ ఫోటో పంపమని ఎడిటర్ లెటర్ వ్రాసేరు. ఇదిగో' అంటూ తన చేతిలో వున్న వుత్తరాన్ని సీత చేతి కందించేడు.

'సీతా! నీవు చాలా అదృష్టవంతురాలివి. నీ కథ పడుతుందని నేను అనుకోలేదు. ఏదో నీవు సరదాపడుతున్నావని కథ పోస్టుచేసేనంతే. సీతా! నీలో ఇంత రచనాశక్తి దాగుందని నేను కలలో కూడా అనుకోలేదు.' సీతను పొగిడేస్తూ ఉత్సాహంతో చెప్పుకు పోతున్నాడు శేఖర్.

సీత సంతోషాన్ని ముఖంలో తెలియపరుస్తూ 'నా కథకు ఫస్టుప్రయిజ్ రావడానికి కారణం మీరే. నాలో ఏమీ గొప్పతనం లేదు' అంది శేఖర్‌తో.

'రచయిత్రిగారూ! ప్లాట్ చెప్పినంతమాత్రంలోగొప్ప లేదు. మంచి శైలితో దానికి పాత్రపోషణచేసి కథ మనస్సును ఆకర్షణతో మత్తుకుపోయినట్లు వ్రాయటమే గొప్ప. ఆ శక్తి నీలోవుంది. నాలో యే గొప్పతనం లేదు.' కథ వ్రాసే విధానాన్ని స్పష్టంగా వివరించేడు శేఖర్.

'నా కథకు మూలం మీరేకదా! అందుకని ముందు మిమ్మల్ని నేను అభినందించాలి. ఎన్నాళ్ళనుంచో నా మనస్సులో గూడుకట్టుకున్న నాకోరిక నెరవేరింది.' అలా అన్నప్పుడు ఆమెలో గర్వరేఖలు తొంగి చూస్తున్నాయి.

'ప్రతీ వ్యక్తికి పట్టుదల, కృషివుండాలి. అవి వున్ననాడు మానవుడు సాధించలేనిది ఏమీలేదు. ఆ పట్టుదల, కృషి నీలో వుండబట్టే నీవు రచయిత్రివి కాగలిగేవు. సీతా! నీవు రచయిత్రివి కావడం కేవలం నా అదృష్టంగా భావిస్తున్నాను. నిజంగా నిన్ను చూసి గర్వపడుతున్నాను సీతా! ఫలానా రచయిత్రి భర్త అంటే సంఘంలో నాకెంత గౌరవం' అంటూ భుజాలెగరేసేడు గర్వంగా.

సీత ఫక్కున నవ్వింది. శేఖర్ కూడా ఆమె నవ్వులో శృతి కలిపేశాడు.

మేము కూడా మీ నవ్వులో భాగం పంచుకుంటున్నాము అన్నట్లుగా తోటలోవున్న గులాబీచెట్లు అటూ ఇటూ గాలికి తెగవూగేస్తున్నాయి.






ఘర్ ఘర్ కీ కహానీ (ఇంటింటి గాథ)

శంకరనాథ్ ఒక మధ్యతరగతి కుటుంబీకుడు అతడు ఆదర్శప్రాయుడైన తండ్రీ, భర్తా కూడాను. మంచం ఉన్నంతవరకే కాళ్లు చాచుకోవాలనేది ఆయనసిద్ధాంతం జీవన ప్రమాణము పెరిగిపోయిన ఈ దినాలలో మధ్య తరగతి కుటుంబీకులు కోరికలు పెంచుకొని, వ్యసనాలకులోనై ఎలా నాశనమయ్యేదీ శంకరనాథ్ కళ్ళారా చూచి వున్నాడు.

శంకరనాథ్ భార్య పద్మ ఆదర్శగృహిణి. ఈ దంపతులకు యిదరు అబ్బాయిలూ; ఒక అమ్మాయీ. పెద్దవాడిపేరు రవి, చిన్నవాడి పేరు రాజా, అమ్మాయిపేరు రూపా, అంతా స్కూల్లో చదువుకుంటున్నారు. ఆ కుటుంబం ఉన్నంతలో తృప్తిచెంది సుఖంగా దినాలు గడుపుతోంది.

సాధూరాం కుటుంబంపై కుటుంబానికి పూర్తిగా విరుదమైనది. శంకరనాథ్ ఒక ఆఫీసు మేనేజరు. అదే ఆఫీసులో సాధూరాం హెడ్‌క్లర్క్. అతనికి మొత్తం అయిదు మంది పిల్లలు. సాధూరాం జీవిత పథం శంకరనాథ్‌కు భిన్నమైనది. శంకర్‌నాథ్‌కు 600 జీతం సాధూరాంకు 300. అయినా కూడా సాధూరాం ఒక గొప్ప బంగాళాలో ఉంటున్నాడు. అతని భార్య జమున వంటినిండా నగలు. వారి పిల్లల ప్రతికోరికా తీర్చగలుగుతున్నారు.

సాధూరాం మంచీ-చెడ్డా అనే విచక్షణ లేకుండా అన్నిమార్గాలా సంపాదించడంలో వెనుకాడడు. ఈ రెండు కుటుంబాల ఆదాయ, వ్యయాలు బేరీజు వేసే మార్గాలే భిన్నంగా వున్నాయి.

పద్మ అన్న సీతారాం మూడో కుటుంబ యజమాని. అతనికి ఆదాయ, వ్యయాలు బేరీజు వేయాల్సిన సమస్యే లేదు, అతని సమస్య అంతా చెడుదారిలో పడ్డ గోపీని మంచి మార్గంలో పెట్టి మునిగే కుటుంబాన్ని ఎలా